క్లుప్తంగా

పీహెచ్‌సీ అభివృద్ధికి సహకరిస్తా !



సత్తెనపల్లి(ముప్పాళ్ల): ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి సహకరిస్తానని ప్రముఖ ప్రవాస భారతీయ వైద్యుడు పాదిలి ప్రసాద్ తెలిపారు. సత్తెనపల్లి మండలంలోని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న ఆరోగ్యసేవలు, వ్యాధి నిర్ధారణ పరీక్షల గురించి ఆయన ఆరా తీశారు. పీహెచ్‌సీ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, ఎప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో ఇద్దరు విద్యార్థుల ప్రతిభ


గంగాధరరెడ్డి


షేక్ ఖాశీం

సత్తెనపల్లి(ముప్పాళ్ల): ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 25న జరిగిన ఛత్తీస్‌గఢ్ మిస్టర్ అండ్ మిస్ బాడీ బిల్డింగ్ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనపరిచి ప్రథమ, తృతీయ స్థానాలు సాధించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామానికి చెందిన వజ్రాల గంగాధర్‌రెడ్డి పురుషుల ఫిజిక్‌లో ప్రథమ ర్యాంక్, ఫిట్ మోడల్స్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి బంగారు, రజిత పతకాలు సాధించాడు. గుంటూరుకు చెందిన షేక్‌ఖాశీం పురుషుల ఫిజిక్, ఫిట్ మోడల్స్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాల్ని కైవసం చేసుకున్నాడు. చదువుకుంటూనే బాడీ బిల్డింగ్‌పై దృష్టి సారించి, మంచి పేరు తెచ్చుకున్నందుకు ఇద్దరినీ ఉపాధ్యాయులు, శిక్షకులు అభినందించారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ

పెదకూరపాడు: మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అచ్చంపేట మండలం తాడువాయి గ్రామానికి చెందిన అగ్రికల్చర్ ఎమ్మెస్సీ చదువుతున్న పేద విద్యార్థి అంజలికి ఎన్నారై భానుప్రకాష్ ఆధ్వర్యంలో సోమవారం ల్యాప్‌టాప్‌ను అందజేశారు. మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత విద్యకు మాగులూరి ఫౌండేషన్ సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాగులూరి హరిబాబు, కుంచనపల్లి కిరణ్, కొండవీటి ప్రసాద్, భవన రాంబాబు, నరసింహరాయులు, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

బెల్లంకొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందజేయాలని ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. నాగిరెడ్డిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. చిన్నారులకు వసతుల్ని పరిశీలించారు. కేంద్రంలో పిల్లలకు అందజేస్తున్న పోషకాహార వివరాల్ని అంగన్‌వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రమైన ఆహారాన్ని అందజేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని చెప్పారు. కేంద్రంలో కిచెన్ గార్డెనింగ్ చేపట్టాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ బద్దూరి శ్రీలక్ష్మి, శేషిరెడ్డి ఉన్నారు.

మహిళ బ్యాగు కత్తిరించి నగదు చోరీ

సత్తెనపల్లి(ముప్పాళ్ల): దుస్తులు కొనేందుకు వెళ్లిన మహిళ బ్యాగులోని నగదు చోరీ చేసిన సంఘటన పట్టణంలోని మహాలక్ష్మీ కాంప్లెక్స్ వద్ద సోమవారం జరిగింది. రఘురాంనగర్‌కు చెందిన ఐదుగురు ముస్లిం మహిళలు మహాలక్ష్మీ కాంప్లెక్స్‌లోని ఓ వస్త్ర దుకాణంలో దుస్తులు కొనేందుకు వెళ్లారు. అదే సమయంలో మరో ముగ్గురు మహిళలు బాలుడుతో అదే దుకాణంలోకి వచ్చారు. దుస్తులు కొంటున్నట్లుగా వ్యవహరిస్తూ పక్కనే ఉన్న ఓ మహిళ బ్యాగును కత్తిరించి, అందులోని రూ.30వేలను తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత బ్యాగు కోసి ఉండటాన్ని గమనించి, పట్టణ పోలీసుల్ని ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అగ్ని ప్రమాద బాధితుకు తాత్కాలిక షెడ్లు

అచ్చంపేట: మండలంలోని పెదపాలెంలో ఈనెల 14న జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు పూర్తిగా కాలిపోయి నిరాశ్రయులైన ఆరు కుటుంబాలకు ప్రభుత్వం శాశ్వత గృహాలు కల్పించే వరకు స్నేహ హస్తాలు ఫౌండేషన్ నిర్మించిన తాత్కాలిక షెడ్లు సోమవారం పూర్తయ్యాయి. వీటిని మంగళవారం ప్రముఖులు ప్రారంభించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి తాయి కరీముల్లా బాబు సోమవారం తెలిపారు. ప్రారంభోత్సవానికి స్నేహ హస్తాలు ఫౌండేషన్ సభ్యురాలు గడ్డిపాటి షర్మిల అమెరికా నుంచి రానున్నట్లు చెప్పారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారుల మధ్య తాత్కాలిక షెడ్లను ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జగన్‌తోనే అవినీతిరహిత, పారదర్శక పాలన

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- తాళ్లచెరువులో రెండవరోజు గడపగడపకు మన ప్రభుత్వం


రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: ముఖ్యమంత్రి జగనన్నతోనే అవినీతిరహిత, పారదర్శక పాలన సాధ్యపడుతుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని తాళ్లచెరువులో సోమవారం సాయంత్రం రెండవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలలో ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్ల జగన్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల్ని వివరించారు. ఏ ఇంటికి ఎంతమేర లబ్ధి చేకూరిందో వివరించారు. ప్రభుత్వ సంక్షేమ కరపత్రాల్ని పంపిణీ చేశారు. ఇంకా ఏమైనా సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఆసరా డబ్బులు పడ్డాయా... అమ్మఒడి వస్తుందా... పిల్లలను బాగా చదివిస్తున్నారా.. ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన వచ్చిందా అంటూ అక్కచెల్లమ్మలను... ప్రతి నెలా పెన్షన్ ఇస్తున్నారా ? అని అవ్వతాతలను ఆప్యాయంగా పలుకరించారు. పక్కా గృహాలు నిర్మించుకున్నారా... నిర్మించుకోకపోతే ఎందుకు నిర్మించుకోలేదని అడిగారు. సమస్య లుంటే తన దృష్టికి తేవాలని ఎమ్మెల్యే కోరారు. సంక్షేమ పథకాలన్నీ తిరిగి అమలు కావాలంటే జగన్ మోహనరెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం భూసారం పెంపొందేందుకు రైతులకు వ్యవసాయశాఖ ద్వారా సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లిపెసర, జనుము విత్తనాల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, సర్పంచ్ కిక్కురు అర్జాలెడ్డి, రాయపరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గోపు అంథోనిరెడ్డి, మాజీ సర్పంచ్ తుమ్మా చిన్నపరెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ శౌర్రెడ్డి, రైతు నాయకులు తుమ్మా లూర్దుమర్రెడ్డి, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, పెదపాలెం మాజీ సర్పంచ్ నెల్లూరి చంద్రబాబు, వైస్ ఎంపీపీ గంగసాని బాబు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులు రాణించాలి


విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

అచ్చంపేట: గ్రామీణ క్రీడాకారులు కూడా అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. మండలంలోని రోకటిగుంట వారిపాలెంలో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు సోమవారం ఆయన బహుమతుల్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు ఎంతో ప్రోత్సాహం ఇస్తోందని తెలిపారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు చేయూతనందచేస్తోందని చెప్పారు.మండల కేంద్రాలలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసేందుకు సీఎం జగన్‌మోహనరెడ్డి అడుగులు వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ డేగెల నూకేశ్వరరావు, డేగెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య పాల్గొన్నారు.

మత్తుకు అలవాటు పడితే భవిష్యత్ చిత్తు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ బ్రహ్మం

అమరావతి: మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను చేజేతులా పాడు చేసుకోవద్దని యువతకు సీఐ ఎ.వి.బ్రహ్మం సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక పల్లోటి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు. సీఐ బ్రహ్మం మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, వైట్‌నర్లు, బోన్‌ఫిక్స్‌లకు యువకులు బానిసలై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వీటిని ఉపేక్షించేది లేదని, ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యం దెబ్బతిని, ఉపాధి అవకాశాలకు గండి పడుతుందని సూచించారు. మత్తులో యువత నేరప్రవృత్తికి అలవాటు పడుతున్నారన్నారు. నేరస్తులుగా మారి పోలీసు కేసుల్లో ఇరుక్కుంటే జీవితం అంతా మాయనిమచ్చ మిగిలిపోతుందన్నారు. భవిష్యత్‌లో వచ్చే ప్రతి అవకాశానికి పోలీసు కేసులు అడ్డుగా నిలుస్తాయని వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువతకు సమాజంలో గౌరవ, మర్యాదలు ఉండవని తెలిపారు. కార్యక్రమంలో పల్లోటి జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

గోవధ నిషేధం

బక్రీద్ పండుగను పురస్కరించుకుని అమరావతి పోలీస్ స్టేషన్‌లో సీఐ బ్రహ్మం సోమవారం ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ నాడు శాంతియుతంగా ప్రార్థనలు చేసుకోవాలని సూచించారు. ఆనందోత్సాహాల నడుమ పండుగ జరుపుకోవాలని చెప్పారు. గోవధ నిషేధమని, అటువంటి కార్యకలాపాలు జరగకుండా చూడాలని ముస్లిం మతపెద్దలకు సూచించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

క్రోసూరు: విద్యార్థులంతా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సెబ్ సీఐ కె. వినయ్‌కుమార్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో విద్యార్థులు బంగారు భవిషత్తు నాశనమవుతుందని తెలిపారు. గంజాయి, హాషిస్, కొకైన్, హెరాయిన్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగిస్తే ఆరు నెలల నుంచి సంవత్సరం పాటు జైలుశిక్ష పడుతుందన్నారు. డ్రగ్స్‌ను కలిగి ఉన్నా, అమ్ముతూ పట్టుపడినా, డ్రగ్స్ సంబంధిత నేరాల్ని ప్రోత్సహించినా 10 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాలు జైలుశిక్ష పడుతుందని చెప్పారు.పరిసర ప్రాంతాలు, విద్యాసంస్థల్లో డ్రగ్స్ వినియోగించే వారి గురించి 14500కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

జగనన్న సురక్షతో సమస్యలకు పరిష్కారం


ఊటుకూరులో జగనన్న సురక్ష ప్రచారంలో పాల్గొన్న మండల ప్రత్యేక అధికారి ఎస్. పద్మశ్రీ


మొక్కపాడులో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

క్రోసూరు: జగనన్న సురక్షతో ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మండల ప్రత్యేక అధికారి ఎస్. పద్మశ్రీ తెలిపారు. మండలంలోని ఊటుకూరు, బయ్యవరం గ్రామాల్లో సోమవారం ఆమె మండల అధికారులతో కలసి జగనన్న సురక్ష సర్వేను పరిశీలించారు. రెండు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ సమస్యలేమైనా ఉంటే వలంటీర్లకు చెప్పాలని గ్రామస్తులకు తెలిపారు. అర్హులైన వారందరికీ ప్ర భుత్వ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని చెప్పారు. ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలందించనున్నట్లు తెలిపారు. నెల రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారి స మస్యలు తెలుసుకోవాలని వలంటీర్లను ఆదేశించారు. అనంతరం అందుకూరు ఎంపీయూపీ పాఠశాలలో నాడు–నేడు పనుల్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్ని తనిఖీ చేశారు. అందుకూరు గ్రామ సర్పంచ్ జంగా సౌభాగ్యలక్ష్మి, జంగా నవీన్, పాఠశాల ప్రస్తుత హెచ్‌ఎం ఎం.తిరుమలరెడ్డి, గతంలో పనిచేసిన హెచ్‌ఎం కృష్ణంరాజు, ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, మండల అధికారులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బెల్లంకొండలో..

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని అందజేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని చేపట్టిందని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెంలో సోమవారం జగనన్న సురక్షపై గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గ్రామాల వారీగా మండల టీములు పర్యటిస్తాయని, వారితో కలసి ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల్ని అర్హులకు అందేలా చూడాలని సూచించారు. ఇంకా అందని వారుంటే సమస్యల్ని తెలుకోవాలని చెప్పారు. సమావేశంలో సచివాలయ మండల కన్వీనర్ గాదె మిల్లు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ బూదాటి మరియదాసు, సర్పంచులు బద్దూరి శ్రీలక్ష్మి, ఆసుల జగన్, మారెళ్ల సరోజిని, ఎంపీటీసీ సభ్యురాలు బద్దూరి రమాదేవి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ కన్వీనర్లు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రాజుపాలెంలో..

మండలంలోని రెడ్డిగూడెంలో సోమవారం జగనన్న సురక్షపై గ్రామ సచివాలయం, వైఎస్సార్ క్రాంతి పథకం సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. సర్వేలో చేపట్టాల్సిన అంశాల్ని మండల ప్రత్యేక అధికారి కేశవరెడ్డి వివరించారు. కార్యక్రమంలో జగనన్న సురక్ష గ్రామ ఇంచార్జి, ఏపీఎం సునీత, పల్నాడు జిల్లా వైఎస్సార్ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ జాని, మార్కెట్ యార్డు డైరెక్టర్ బాషా, మైనార్టీ మండల కన్వీనర్ సుభాని, సచివాలయ కన్వీనర్లు సైదా, దరియాబి, వెంకటరెడ్డి, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో...

మండలంలోని ఇరుకుపాలెం, దమ్మాలపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వేను పశుసంవర్ధకశాఖ ఏడీఏ, మండల ప్రత్యేకాధికారి కాంతారావు, తహసీల్దార్ ఎమ్.భవాని శంకర్, ఎంపీడీవో పి.పుట్టారెడ్డి సోమవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బందితో కలసి ఇళ్లకు వెళ్లారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా..లేదా? ఏమైనా ఇబ్బందులుంటే చెప్పాలని కోరారు. వలంటీర్లు, గృహ సారథులు ప్రతి ఇంటినీ సందర్శించాలని చెప్పారు. గ్రామస్తులు చెప్పే సమస్యల్ని తెలుసుకొని వారికి టోకెన్లు అందించాలని సూచించారు.

జులై 1 నుంచి నిర్వహించనున్న క్యాంపుల ద్వారా వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాల్ని అందిస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.జె.ఎం.రామలింగారెడ్డి, శిరిగిరి గోపాలరావు, సచివాలయ జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణ, కోటిరెడ్డి పాల్గొన్నారు.

రాజుపాలెంలో..

ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందని వారు జగనన్న సురక్ష సర్వేలో తమ సమస్యల్ని తెలపాలని ఎంపీడీవో టి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని మొక్కపాడులో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి, యజమానుల్ని సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. 11 సర్టిఫికెట్లను జులై 1 నుంచి నెలాఖరు వరకు ఎలాంటి రుసుం తీసుకోకుండా ఒక్కరోజులోనే అందిస్తామని ఎంపీడీవో గ్రామస్తులకు తెలిపారు. సుమారు 50 ఇళ్లు సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పీఎస్ మిల్క్‌రాజు, గ్రామ సచివాలయం, ఆరోగ్య, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై భయాందోళనలు వద్దు


సర్వేలో పాల్గొన్న వైద్య సిబ్బంది

సత్తెనపల్లి(ముప్పాళ్ల): కుష్ఠు వ్యాధిపై భయాందోళనలు వద్దని, చర్మంపై స్పర్శ, నొప్పి, దురద లేని రాగి వర్ణపు మచ్చలు ఉంటే వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఫణిదం పీహెచ్‌సీ వైద్యాధికారి యు.శ్రీలక్ష్మీ కవిత చెప్పారు. మండలంలోని ఫణిదం పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ జులై 16 వరకు కుష్ఠు వ్యాధి కేసుల గుర్తింపు, ప్రచారం, సర్వే(ఎల్‌సీడీసీ) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొనాలని ఆమె ఆదేశించారు. అందులో భాగంగా ఫణిదంలో సర్వేను పరిశీలించి, సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు.

కుష్ఠు వ్యాధి తీవ్రతను బట్టి చేతులు, పాదాలు, నరాల తిమ్మిర్లుతో పాటు కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం ఉంటుందన్నారు. చేతులు, పాదాలు బలహీనంగా ఉండటం, అంగవైకల్యం కలిగి ఉండటం వంటి లక్షణాలు ఉంటాయని ఆమె వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ పారా మెడికల్ అధికారి నాగేశ్వరరావు నాయక్, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు, ఎస్‌కే. ఖదీర్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించాలి

అచ్చంపేట: కుష్ఠు వ్యాధిగ్రస్తుల్ని సకాలంలో గుర్తించి, చికిత్స ప్రారంభిస్తే అంగవైకల్యం నుంచి కాపాడవచ్చని వైద్యాధికారి శ్యామల తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం ఆమె వ్యాధి నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అచ్చంపేట, వేల్పూరు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆశాలు, ఏఎన్‌ఎంలు కేటాయించిన గ్రామాలకు వెళ్లి వ్యాధి లక్షణాలున్న వారిని పీహెచ్‌సీకి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజేష్, కమ్యూనిటీ హెల్త్ అధికారి శివనాగేశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్ పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

నూరు శాతం రాయితీపై కంది విత్తనాల పంపిణీ

నకరికల్లు: ఎన్ఎఫ్ఎస్ఎం పథకం ద్వారా ఎల్ఆర్‌జి–52 రకం కంది విత్తనాలను నూరు శాతం రాయితీపై సరఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సోమవారం తెలిపారు. 600 కంది విత్తనాల మినీకిట్స్ సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కౌలురైతులందరికీ సీసీఆర్సీ కార్డుల్ని త్వరమే మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్డుల ద్వారా ఉచిత పంట బీమా, పంట నష్ట పరిహారం పొందవచ్చని తెలిపారు.

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నరసరావుపేట బ్రాంచి వారు 21.06.2023 ప్రచురితమైన రామ్మసటోయిస ధనలక్ష్మి గారి ప్రకటనలో జోన్ సెం. 11-7C2Aగా చదువుకోగలరు.
లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ
న్యాయవాదులు, 3వలైను, రవీంద్రనగర్, గుంటూరు.
9030595227, 9848052914

బహిరంగ ప్రకటన

నా క్లయింటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నరసరావుపేట బ్రాంచి వారి సూచనలు పొంది యిందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పైనం రంగారెడ్డి గారి కుమారుడు పైనం ఏడుకొండలరెడ్డి గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు క్లయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియజేయవలయును. ఎట్టి అభ్యంతరములు క్లయిములురానిచో మా క్లయింటు సదరు పైనం ఏడుకొండల రెడ్డిగారికి ఋణము మంజూరు చేయును. షెడ్యూలు: బాపట్ల డి॥ చెరుకుపల్లి సబ్ డి॥ యిలాకా, చెరుకుపల్లి మండలం పొన్నపల్లి గ్రామ పంచాయితీ ఏరియాకు చెందినటువంటిన్ని పైన వ్రాయబడిన రిత్యా నాకు సంక్రమించి నాకు సంపూర్ణ హక్కు భుక్తములు కలిగి నా స్వార్జితమైన ఆస్తి పొన్నపల్లి గ్రామ డి.నెం.163-8ఏరు, య.20ట్లుకు డి.నెం.163-8బి రు య.0.40ట్లులో య.0.07ట్లు న్నూ వెరసి రెండు నెంబర్లు తాలూకు ఏక ప్రదేశముగా ఉన్న య.0.27ట్లుదిరై ఉండి పొన్నపల్లి గ్రామ పంచాయితీ 1వ బ్లాకు రోడరు నెం.110రకు సమీపమున గల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు. తూర్పు: ఈ రోజున పఠాన్ అబ్దుల్ గఫూర్ ఖాన్ గారునకు విక్రయించిన స్థలం హద్దు, దక్షిణం: 18అడుగుల వెడల్పుగల బజారు హద్దు, పడమర: గుళ్ళపల్లి నగరం పోవు ఆర్ అండ్ బి రోడ్డు, ఉత్తరం: హర్షవర్ధన్ ఎడ్యుకేషనల్ సొసైటి వారి ప్రహరిగోడ హద్దు. యీ హద్దుల మధ్య చ.అం.27000లు లేక చ.గ.1306.8లు లేక చ.మీ 1092.6ట్లు ఖాళీ నివేశన స్థలం మాత్రం నేను విక్రయించి స్వాధీనపర్చడమైనది. దీనికి సంబం ధించిన డాక్యుమెంటు నెం.2537/2022 SRO చెరుకుపల్లి
లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ
న్యాయవాదులు, 3వలైను, రవీంద్రనగర్, గుంటూరు.
9030595227, 9848052914

ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు



సదస్సులో మాట్లాడుతున్న ఏవో అరుణ

బొల్లవరం(ముప్పాళ్ల): పంట సాగుదారు కార్డు ద్వారా ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులు పంట రుణాలు, రైతు భరోసా పథకాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ తెలిపారు. మండలంలోని బొల్లవరంలో దళిత బహుజన రిసోర్సు సెంటర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వ పథకాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ పంట సాగు కార్డు ద్వారా ప్రభుత్వం నుంచి అందించే అన్ని వ్యవసాయ పరికరాల్ని పొందవచ్చని తెలిపారు. ఉద్యాన శాఖాధికారి సీహెచ్. జనని మాట్లాడుతూ గట్ల మీద కంది, ఆముదం, మొక్కజొన్న పంటల్ని వేసుకున్నట్లయితే పంటలకు రక్షణగా ఉంటుందని పత్తి, మిర్చి రైతులకు సూచించారు. డీబీఆర్సీ ఏరియా కో–ఆర్డినేటర్ మేడె వెంకటరమణ, డీబీఆర్సీ రీజినల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, వీఆర్వో సంజీవరావు, పంచాయతీ కార్యదర్శి కోటిరెడ్డి, వీఏఏ శ్రీనివాసరావు, మహిళా పోలీసు రమ్యకృష్ణ పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డులతో పలు ఉపయోగాలు

నకరికల్లు: సీసీఆర్సీ (క్రాప్ కల్టివేషన్ కార్డ్స్) వల్ల ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులకు పలు ఉపయోగాలున్నాయని డీబీఆర్సీ ఏరియా కో- ఆర్డినేటర్ కోటిరత్నం తెలిపారు. రైతుభరోసా కేంద్రాల నుంచి రాయితీ ఎరువులు, విత్తనాలు పొందవచ్చని చెప్పారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో కౌలు రైతులకు కోసం సీసీఆర్సీ కార్డుల ప్రచారోద్యమాన్ని సోమవారం నకరికల్లులో నిర్వహించారు. ఈ సందర్భంగా కోటిరత్నం మాట్లాడుతూ ఈ- క్రాప్, ఈ-కేవైసీ చేసిన పొలాలకు మాత్రమే రాయితీలు వర్తిస్తాయని తెలిపారు. సీసీఆర్సీ కార్డుల వల్ల ప్రయోజనాల్ని కరపత్రాల ద్వారా గ్రామ గ్రామాన ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు.

బాలాజీరావు సేవలు అభినందనీయం


సంతాప సభలో నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సత్తెనపల్లి(ముప్పాళ్ల): పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం స్థానిక కళారాధన సంస్థ ఆధ్వర్యంలో హిందూ మహాప్రస్థానం సేవా సమితి కార్యదర్శి మట్టా బాలాజీరావు సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో కళారాధన సంస్థ వ్యవస్థాపకులు, విశ్రాంత పోస్టుమాస్టరు జె.యల్.యస్.శర్మ మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణంలో వేణుగోపాలస్వామి జీర్ణోద్ధరణ, పరివర్తన పాఠశాల నిర్మాణానికి బాలాజీరావు ఎంతో చేయూతనిచ్చి మంచి పేరు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు పెరుమాళ్ల శివన్నారాయణ, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు కంభాల శ్రీనివాస్, పట్టణ ప్రముఖులు చల్లా రత్తయ్య, కాపుగంటి రత్తయ్య, సిద్ధార్థ శ్రీనివాస్, కంఠంనేని వెంకటేశ్వరరావు, ప్రజానాట్యమండలి నియోజకవర్గ అధ్యక్షుడు ఎం.రాంబాబు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జి.అమరనాథ్, వి.చెన్నకేశవరావు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పి.ఇర్మియా, లయన్స్ క్లబ్ నాయకులు కోట వెంకటేశ్వర్లు, భవిరిశెట్టి శివ సుబ్బారావు పాల్గొన్నారు.

75 త్యాళ్లూరులో పేరెంట్స్ కమిటీ సమావేశం

పెదకూరపాడు: 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల పేరెంట్స్ కమిటీ సమావేశం సోమవారం అధ్యక్షుడు గుత్తికొండ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, మనబడి నాడు–నేడు, పాఠశాల నిర్వహణ, హైస్కూల్, బాలికల కళాశాల అంశాలపై చర్చించారు. సమావేశానికి పరిశీలకులుగా పెదకూరపాడు మండల ఎండీవో–2 సత్యనారాయణ వ్యవహరించారు. అనంతరం జగనన్న గోరుముద్ద, నాడు–నేడు పనుల్ని పేరెంట్స్ కమిటీ పరిశీలించింది. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్నకే సాధ్యం


రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయప్రతాప్‌రెడ్డి, నేతలు

అచ్చంపేట: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ పోటీపడుతున్నాయని, అందుకు కారణమైన ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డికి అండగా ఉండాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాదిపాడులో సోమవారం ఆయన పలు అంతర్గత రోడ్ల నిర్మాణాలకు కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించారు. రూ.20లక్షలతో గ్రామం నుంచి బల్లకట్టు వరకు సిమెంటు రోడ్డు వేసే పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి చేసే ప్రభుత్వానికి మద్దతివ్వాలని కోరారు. కల్లబొల్లి కబుర్లతో మాయమాటలు చెప్పే వారికి మరొక్కసారి బుద్ధి చెప్పాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదా వెంకట్రావు, సత్తెమ్మ తల్లి దేవాలయ కమిటీ చైర్మన్ గుడారి గోపి, జెడ్పీహెచ్ స్కూలు పీఎంసీ చైర్మన్ షేక్ లాలు, ఆర్య వైశ్య సంఘ నాయకులు దేవరశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కంబాల ఏడుకొండలు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాల్ని మెరుగు పర్చుకోవాలి

క్రోసూరు: బాలికలంతా జీవన నైపుణ్యాల్ని మెరుగు పర్చుకోవాలని గుడ్‌షెపర్డ్స్ సంస్థ సుపీరియర్ సిస్టర్ విన్నరసి సూచించారు. గుడ్‌షెపర్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలపై బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని బయ్యవరం, ఊటుకూరు గ్రామాల జెడ్పీ పాఠశాలల్లో సోమవారం నిర్వహించారు. ఊటుకూరు జెడ్పీ పాఠశాలలో సిస్టర్ విన్నరసి, బయ్యవరం పాఠశాలలో బచ్‌పన్ బచావో స్వచ్ఛంద సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ తిరుపతిరావు పాల్గొని మాట్లాడారు. డబ్ల్యూహెచ్‌వో తెచ్చిన 10 జీవన నైపుణ్యాలైన నిర్ణయం తీసుకోవడం, ఒత్తిడి నిర్వహణ, పరస్పర వ్యక్తిగత సంబంధాలు, సృజనాత్మకంగా ఆలోచించడం, విమర్శనాత్మక ఆలోచన, స్వీయ జాగృతి, భావ నియంత్రణ, స్వయానుభూతి, ప్రతిభా పూర్వక భావవ్యక్తీకరణ, సమస్య పరిష్కారంపై విపులంగా బాలికలకు వివరించారు. సిస్టర్ డయానా పరస్పర, వ్యక్తిగత సంబంధాల గురించి వివరించారు. కార్యక్రమంలో బయ్యవరం పాఠశాల హెచ్‌ఎం ఎం.సాంబశివరావు, ఊటుకూరు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఎం.ప్రభాకరరావు, గుడ్‌షెపర్డ్స్ కాన్వెంట్ సిబ్బంది కవిత, లలిత, బాబూరావు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం


గౌతమ్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న కోటేశ్వరరావు

పెదకూరపాడు:చిన్నతనం నుంచి వెన్ను సమస్యతో బాధపడుతున్న తొమ్మిది సంవత్సరాల బాలుడు కలింగ గౌతమ్‌కు జీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ నెలకుదిటి వరప్రసాద్ సోమవారం రూ. 20వేల ఆర్థిక సాయం చేశారు. దివంగత నాదెండ్ల వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఆయన తండ్రి నాదెండ్ల కోటేశ్వరరావు చేతుల మీదుగా నగదును బాలుడికి అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం కోసం నాదెండ్ల వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థంగా భవిష్యత్తులో అనేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మన్నవ నాని, గ్రామ వైస్ సర్పంచ్ గుంటుపల్లి కోటేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చెన్నుపాటి బుల్లిబాబు, సొసైటీ మాజీ డైరెక్టర్ గోగులపాటి పాపారావు పాల్గొన్నారు.